సంపుటి :02 సంచిక :276 పేజీలు :06
వెల ₹7
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శనివారం 10, జనవరి 2026

# ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర



- కేంద్ర ప్రభుత్వానిది కక్షసాధింపు చర్య
- బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు తెలియజేయాలి
- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు పిలుపు

5



# కోటాపై బీసీల నజర్



## పట్టణ పోరులో వారి కోటా 32% ?

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీసీ రిజర్వేషన్ల కోటా అంశం ఇప్పుడు తెరమీదకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42శాతం కోటా సాంకేతిక కారణాల నేపథ్యంలో అమలు కాదన్న విషయం అందిరికీ తెలిసిందే. కానీ, ఆ కోటా ఎంత? అనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కోటాపై స్పష్టత ఉమ్మ డి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీలకు చెందిన ఆశావహులు కోటా కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 12 లేదా 13న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో కోటాపై స్పష్టత రాగానే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీ కోటాను 32 శాతానికి పరిమితం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

– అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి

04

- రిజర్వేషన్ల లెక్కలపై ఆశావహుల గంపెడాశలు
- 12 లేదా 13న జరిగే మంత్రివర్గ సమావేశంలో కోటా ఫైనల్
- ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం

2



# పిల్లల కిడ్నాప్ ముఠా గుట్టురట్టు

- కాజీపేట, టాస్క్‌ఫోర్స్ టీం ప్రత్యేక ఆపరేషన్
- అంతర్ జిల్లాకు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఐదుగురు చిన్నారుల రెస్క్యూ
- వారి తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

5

## సీఎం మేడారం పర్యటనకు సన్నాహాలు

2

శాంతి భద్రతలు, బందోబస్తు, ప్రొటోకాల్‌పై ప్రత్యేక దృష్టి

సీఎం కార్యక్రమానికి సంబంధించిన పనుల్లో అధికారులు నిమగ్నం



# రేపు మేడారానికి డిప్యూటీ సీఎం భట్టి

- ఆయనతోపాటు పలువురు మంత్రులు కూడా..
- మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశ నిర్వహణ

2

మేడారం మహాజాతర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయనతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సైతం తరలివస్తున్నారు.

- అక్షరదర్బార్, మేడారం

# చీమ చిటుక్కుమన్నా అలర్ట్

- మేడారం జాతరకు భారీ బందోబస్తు
- 12 వేల మంది పోలీసులతో పటిష్ట నిఘా



- మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- రంగంలోకి ఇద్దరు సీపీలతో పాటు 15 మంది ఎస్పీ స్థాయి అధికారులు
- అవసరమైతే మరో 20 మందికి పైగా ఐపీఎస్ లు

2

# కోటాపై బీసీల నజర్

- పట్టణ పోరులో వారి కోటా 32% ?
- రిజర్వేషన్ల లెక్కలపై ఆశావహుల గంపెడాశలు
- 12 లేదా 13న జరిగే మంత్రివర్గ సమావేశంలో కోటా ఫైనల్
- ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం




అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది. ఈ తరుణంలో ఇప్పుడు బీసీల నజర్ వారి కోటాపై ఉంది. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 117 మున్సిపాలిటీలు, ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరుగనున్నాయి. దీనిలో భాగంగానే ఉమ్మడి జిల్లా పరిధిలోని పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, కేసముద్రం, మరిపెడ, తొర్రూరు, ములుగు మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో తమ వాటా కోసం బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఏ మున్సిపాలిటీలో వారు కోటాపై లెక్కలు వేసుకుంటున్నారు.

**- బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏం చెప్పిందంటే..**

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తొలుత బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ మేరకు అసెంబ్లీలో చట్టసవరణ కూడా చేసింది. కానీ, సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితికి లోబడి రిజర్వేషన్లు ఉండాలని ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించడంతో మున్సిపల్ ఎన్నికల్లో బీసీ కోటాను 32 శాతానికి పరిమితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు తన నివేదికలోనూ ఇదే విషయాన్ని సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా, అందులో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కేటాయించిన స్థానాలు పోను మిగిలిన వాటిని బీసీలకు కేటాయించనున్నారు.

**- మంత్రివర్గ సమావేశంలో ఫైనల్**

రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు వేచి చూస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానాన్నే మున్సిపల్ ఎన్నికల్లోనూ అమలు చేసే అవకాశం ఉంది. ఈ నెల 12 లేదా 13 తేదీల్లో జరిగే మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల శాతంపై తుది ముద్ర పడనుంది. ఉమ్మడి జిల్లాలోని పరకాల నుంచి ములుగు వరకు ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో రిజర్వేషన్ల లెక్కలు తేలితేనే ఎన్నికల ప్రచారం ఊపందుకుంటుంది. ప్రభుత్వం బ్యాలెట్ పేపర్ విధానంలోనే ఈ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండగా, బీసీ కోటాపై స్పష్టత రాగానే 17వ తేదీన అధికారికంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది.




# సీఎం మేడారం పర్యటనకు సన్నాహాలు

- సీఎం కార్యక్రమానికి సంబంధించిన పనుల్లో అధికారులు నిమగ్నం
- శాంతి భద్రతలు, బందోబస్తుపై ప్రత్యేక దృష్టి



అక్షరదర్బార్, మేడారం : ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి రానున్న నేపథ్యంలో, ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. సీఎం కార్యక్రమం ఎలాంటి లోపాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మేడారంలో కొనసాగుతున్న ఆదివాసీ మ్యూజియం, ఆర్‌టీసీ పార్కింగ్ స్థలాలు, టెంట్ సిటీ పనులను జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, జిల్లా ఎస్పీ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శాంతి భద్రతలు, బందోబస్తు ఏర్పాట్లు, ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అధికారులను నియమించినట్లు తెలిపారు. సీఎం పర్యటన సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





# చీమ చిటుక్కుమన్నా అలర్ట్

- మేడారం జాతరకు భారీ బందోబస్తు
- 12 వేల మంది పోలీసులతో పటిష్ట నిఘా
- మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- రంగంలోకి ఇద్దరు సీపీలతో పాటు 15 మంది ఎస్పీ స్థాయి అధికారులు
- అవసరమైతే మరో 20 మందికిపైగా ఐపీఎస్ లు

అక్షరదర్బార్, మేడారం: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. గతంతో పోలిస్తే ఈసారి భక్తుల రద్దీ పోలిస్తే 30 శాతం అధికంగా ఉండే అవకాశం ఉండటంతో తెలంగాణ పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. సుమారు 12 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనుంది. మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో ములుగు ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బందోబస్తును వరంగల్, రామగుండం సీపీలతో పాటు 15 మంది ఎస్పీ స్థాయి అధికారులు, 20 మందికి పైగా ఐపీఎస్ ఆఫీసర్లు పర్యవేక్షించనున్నారు. ఐజీ ఈ మేరకు శనివరాం మేడారం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

**- ట్రాఫిక్ నియంత్రణపై నజర్**

ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. ములుగు గట్టమ్మ దేవాలయం నుండి మేడారం వరకు 430 సీసీ కెమెరాలు, 20 డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ వాహనాల కోసం పసర నుండి ప్రాజెక్ట్ నగర్, నార్లాపూర్ మీదుగా ప్రత్యేక మార్గాలను కేటాయించారు. భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో, పార్కింగ్ స్థలాల్లో తాగునీరు, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పిస్తున్నారు. ఐదు ప్రధాన మార్గాల ద్వారా రాకపోకలు సాగించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు క్లౌడ్ మేనేజ్మెంట్ పద్ధతిని అనుసరిస్తున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. గద్దెల వద్ద క్యూలైన్ల నిర్వహణ కోసం ప్రత్యేక బారికేడ్లు, హుండీల వద్ద విడి లైన్లు ఏర్పాటు చేశారు. రద్దీ విపరీతంగా పెరిగినప్పుడు భక్తులను కంపార్ట్‌మెంట్ల వారీగా దర్శనానికి అనుమతిస్తూ, దర్శనం పూర్తయిన వారిని త్వరితగతిన బయటకు పంపేలా ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు 'రోప్ పార్టీ'లను సిద్ధం చేశారు.

# రేపు మేడారానికి డిప్యూటీ సీఎం భట్టి

- పలువురు మంత్రులు కూడా..
- మేడారం జాతర ఏర్పాట్లపై సమీక్ష



అక్షరదర్బార్, మేడారం: మేడారం మహాజాతర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయనతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సైతం తరలివస్తున్నారు. మొదట వారు మధ్యాహ్నం 12:45 గంటలకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చేరుకుంటారు. 2 గంటలకు మేడారం చేరుకుని అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత సాయంత్రం 4:30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

# సంక్రాంతి సెలవుల్లో ఇళ్లు జాగ్రత్త

- ఊళ్లకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్



అక్షర దర్బార్, చిట్యాల : సంక్రాంతి సెలవుల సందర్భంగా ఇళ్లను విడిచి వెళ్లే ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్ సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు పొరుగువారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సాధ్యమైనంత వరకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంట్లో నగదు, బంగారం ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఇంటి ముందు, వెనుక లైట్లు వెలిగేలా చూడాలని, సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దని హెచ్చరించారు.

# పరామర్శ..

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దివంగత పెద్దపల్లి వీరస్వామి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు (సాయిరాం) ఈ క్రమంలో పిడిసిల్ల గ్రామ సర్పంచ్ నైనకంటి మమత ప్రభాకర్ రెడ్డి శుక్రవారం భవిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు మృతుని కుటుంబానికి టిఆర్ఎస్ పార్టీ పరంగా ఆదుకుంటామని టిఆర్ఎస్ నేత నైన కంటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు ,ఈ కార్యక్రమంలో ఆర్టిఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, పిడిసిల్ల ఉపసర్పంచి మాదం చైతన్య సురేష్, బిఆర్ఎస్ నాయకులు పెద్దపెల్లి గోవర్ధన చారి పెద్దపల్లి వెంకటనారాయణ రాయబారం వేణు గిరబోయిన అనిల్, అరుణ తదితరులు పాల్గొన్నారు

# మేడారంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు

## గద్దెల వద్ద అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ వన దేవతలను దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారంలో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి వన దేవతలను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణ అభివృద్ధి పనులు, ఫ్లోరింగ్, క్యూ లైన్ షెడ్ల నిర్మాణాలను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సెలవు దినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఎలాంటి అవాంతరాలు లేకుండా దర్శనం కల్పించాలని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా గద్దెల పునఃప్రారంభం జరుగనున్న నేపథ్యంలో పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. గద్దెల ప్రాంగణం ఆకర్షణీయంగా కనిపించేలా ఆధునిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆలయ పూజారులు, గుత్తేదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రేఖంపల్లిలో పశు వైద్య శిబిరం

అక్షర దర్బార్, దుగ్గొండి: రేఖంపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స వైద్యశిబిరం నిర్వహించబడింది. శిబిరానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ కొలుగూరి సుజాత హాజరై ప్రారంభం చేశారు. శిబిరంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ బి.బాలాజీ రైతులను ఉద్దేశించి, దూడలకు ప్రతినెలకు ఒకసారి నట్టల మందు 6 నెలల వయస్సు వచ్చే వరకు ఇవ్వాలని సూచించారు. డాక్టర్ వొడ్డేపల్లి సోమశేఖర్, డాక్టర్ ఎల్.శారద, డాక్టర్ బి.సురేష్, మేడపల్లి గారు ప్రతి రైతు కనీసం 10 గుంటల భూమిలో పచ్చగడ్డి వేయాలని, పశువుల కోసం ఎన్.ఆర్.జి పథకం ద్వారా పాకలు ఏర్పాటు చేయాలని సూచించారు. శిబిరంలో 132 పశువులు వచ్చినట్లు నమోదు కాగా, వాటిలో 40 ఎద్దులు, 29 దూడలకు నట్టల నివారణ మందులు, 15కు గర్భకోశ వ్యాధుల చికిత్స, 33 పశువులకు సాధారణ వైద్య సేవలు ఉచితంగా అందజేయబడింది. ఉప సర్పంచ్ పొన్నం వంశీ గోపాలమిత్ర, సూపర్వైజర్ ఎం.డి.జహంగీర్, వెటర్నరీ అసిస్టెంట్ పావని, శెట్టిపల్లి ప్రసాద్, బి.లక్ష్మీనారాయణ, బి.మధుకర్, కే.ప్రసాద్, అక్బర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

అక్షరదర్బార్, పరకాల : పరకాల బస్టాండ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న చిరు వ్యాపారుల కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ కాంటెస్ట్ ఎమ్మెల్యే డా. కాళీ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. అలాగే, అక్కడ ఇటీవల మహిళ మృతి చెందిన బాధాకర ఘటన నేపథ్యంలో చిరు వ్యాపారులకు తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. శనివారం పరకాల బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డా. కాళీ ప్రసాద్్రావు, మీడియాపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన రెండేళ్ల పాలనలో పరకాల అభివృద్ధి చారిత్రకంగా శూన్యమని విమర్శించారు. ఈ క్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఆర్పి జయంత్, లాల్ కోలనుపాక, భద్రయ్య, పూర్ణచారి, చందుపట్ల రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు సిరంగి సతీష్ కుమార్, మార్త బిక్షపతి, బండి రవి, బాసాని సోమరాజు తదితరులు పాల్గొన్నారు.




## మోడీ విధానాలపై రైతు–కార్మిక సంఘాల నిరసన

అక్షర దర్బార్, వరంగల్ : కేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు–కార్మిక వ్యతిరేక విధానాలపై అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్), అఖిల భారత కార్మిక సంఘాల వేదిక (ఏఐసిటియు) మరియు అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య (ఏఐఏడబ్ల్యూఎఫ్) కార్యకర్తలు శనివారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద రాస్తారోకో చేశారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ, రైతులు కష్టపడి పంటలు పండిస్తున్నప్పటికీ సరైన ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నూతన విత్తన చట్టం, విద్యుత్ చట్టం, వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం వంటి విధానాలు రైతులకు, కార్మికులకు నష్టాన్ని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం

- బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అండ్రు రాజేంద్రప్రసాద్ రెడ్డి
- ఘనంగా బాలాజీ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు






అక్షర దర్బార్, నర్సంపేట రూరల్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అండ్రు రాజేంద్రప్రసాద్ రెడ్డి తెలిపారు. బాలాజీ టెక్నో స్కూల్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్, అక్షర ది స్కూల్‌ల వార్షికోత్సవ వేడుకలు శుక్ర, శని వారాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ డా. అండ్రు రాజేంద్రప్రసాద్ రెడ్డి, సెక్రటరీ డా. జి. రాజేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ డా. కె. దుష్యంత్ రెడ్డి, ట్రెజరర్ డా. ఏ. వనజ, డైరెక్టర్లు డా. పావని రెడ్డి, డా. కీర్తన రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులు చేసిన స్వాగత నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రదర్శనలు తల్లిదండ్రులను విశేషంగా అలరించాయి. అనంతరం ప్రిన్సిపాళ్లు విద్యార్థులు సాధించిన విద్యా, క్రీడా విజయాలు, యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. డా. రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల సమిష్టి కృషితోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పట్టణాల స్థాయిలో తీర్చిదిద్దేందుకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల ఏవో సురేష్, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్, బాలాజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతి, అక్షర ది స్కూల్ ప్రిన్సిపల్ భవాని, రీజినల్ ప్రిన్సిపల్ శ్రీధర్, బాలాజీ మహిళా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మోర్తాల రామరాజు, ఉపాధ్యాయులు బోధ నేతర సిబ్బంది, సెక్యూరిటీ పాల్గొన్నారు




మాట్లాడుతున్న చైర్మన్ రాజేంద్రప్రసాద్ రెడ్డి





## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ & బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేయగా, ఐదుగురు సభ్యులకు కన్సలేషన్ ప్రైజ్ రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్మృతి బహుమతులు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'అంబేద్కర్ భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి'

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో రైతు వేదిక భవనం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని బీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారపెల్లి క్రాంతికుమార్, దళిత నాయకుడు అరికెళ్ల దేవయ్య ఎమ్మెల్యేను కోరారు. దాదాపు ఐదేళ్ల క్రితం పశువుల దవాఖాన ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో ముళ్ల కంచెలు, చెట్లను తొలగించి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అప్పటి నుంచే అదే స్థలంలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ఎమ్మెల్యేకు పలుమార్లు భవన నిర్మాణంపై విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. తర్వాత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును అంబేద్కర్ జయంతి సందర్భంగా రూ.50 లక్షలతో భవన నిర్మాణం చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి తాసిల్దార్‌కు సూచనలు ఇచ్చారని తెలిపారు. వచ్చే అంబేద్కర్ జయంతికి భవనంలోనే వేడుకలు నిర్వహిద్దామని చెప్పినప్పటికీ, ఏడాది గడిచినా ఇప్పటివరకు శంకుస్థాపన కూడా జరగకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు మారపల్లి విజయ్, మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్‌తో పాటు దళిత నాయకులు మొగిలి, మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్సీని కలిసిన సర్పంచ్

అక్షర దర్బార్, పరకాల : గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్‌తో కలిసి గ్రామ వార్డు సభ్యులు ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులపై వినతిపత్రం సమర్పించారు. గ్రామాభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సోమవారం మొట్లపల్లిలో గ్రామసభ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం బహిరంగ గ్రామసభ నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ నరహరి వెంకటరెడ్డి తెలిపారు. గ్రామంలో కొంతకాలంగా పేరుకుపోయిన సమస్యలపై చర్చించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన చెప్పారు. మొట్లపల్లి నుంచి నర్సింగాపూర్ వరకు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు పనులు గ్రామ పరిధిలో ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే మహిళా సమాఖ్య పక్క భవనానికి స్థల సేకరణపై ప్రజాభిప్రాయం తీసుకోవడంతో పాటు, గ్రామ చెరువు మరియు ప్రధాన రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో రోడ్డు ఆక్రమణలపై చర్యల విషయంలో ప్రజల అభిప్రాయం మేరకు తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామసభకు గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

# బైక్ దొంగ అరెస్ట్

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఉదయం అంబేద్కర్ బొమ్మ వద్ద వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తిని ఆపి విచారించగా, అతడు నడుపుతున్న స్పెండర్ ప్లస్ బైక్ దొంగతనానికి సంబంధించినదిగా గుర్తించారు. నిందితుడు పరకాల శ్రీనివాస కాలనీకి చెందిన మంద అరవింద్ (22)గా పోలీసులు తెలిపారు. జల్సాలు, మద్యానికి అలవాటు పడి డబ్బుల అవసరాల కోసం ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. ఇటీవల పిట్టవాడలో జరిగిన బైక్ దొంగతనం కేసులో అతడిపై క్రైమ్ నెంబర్ 09/2026 కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై పవన్ తదితర సిబ్బందిని పరకాల సీఐ క్రాంతికుమార్, ఏసీపీ సతీష్ బాబు అభినందించారు.



# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

- వీబీ జీ-రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



అక్షర దర్బార్, భూపాలపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వీబీ జీ-రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఉపాధిని దెబ్బతీయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. పేదల కడుపు నింపే లక్ష్యంతో అమలులోకి తెచ్చిన ఉపాధి హామీ పథకం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. గాంధీ పేరు తొలగించి ఆయన ప్రతిష్టను తగ్గించే ప్రయత్నాలకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాబోయే మున్సిపల్ ఎన్నికలపై మాట్లాడిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం

–మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు సెగ్గెంపల్లి, గడ్డిగానిపల్లిలో పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కోసం భూములు కోల్పోయిన రైతులకు గతంలో సకాలంలో రైతుబంధు అందేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రూ.15 వేల రైతు సాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు రూ.12 వేలేనని చెప్పినా అది కూడా సక్రమంగా అందడం లేదన్నారు. వర్షాకాలంలో యూరియా సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడ్డారని, ఇది రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కరోనా వంటి కష్టకాలంలోనూ అభివృద్ధి కొనసాగించామని, ప్రస్తుతం రెండేళ్లు గడిచినా అభివృద్ధికి అడుగులు పడడం లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో మాటలకే పరిమితమైనవారిని కాదు, పనులు చేసిన బీఆర్ఎస్‌ను ఆదరించాలని, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే భూపాలపల్లికి న్యాయం జరుగుతుందని రమణా రెడ్డి పిలుపునిచ్చారు.



# న్యూస్ 19 యాజమాన్యంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్

అక్షర దర్బార్, శాయంపేట : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై అసత్య కథనాలు ప్రచురించిన న్యూస్ 10 పత్రిక యాజమాన్యంపై ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ (బుజ్జన్న) డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం శాయంపేట మండల కేంద్రంలో న్యూస్ 10 పత్రికలో ప్రచురితమైన వార్తల ప్రతులను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే పై తనపై అసత్య కథనాలు రాసి తనను మనోవేదనకు గురిచేశారని ఆరోపించారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం సాధారణ కేసులే నమోదు చేశారని తెలిపారు. పత్రిక యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే వెంటనే ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు శాంతియుత పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారపల్లి వరదరాజు, మనికే కుమారస్వామి, రేణికుంట్ల సదయ్య, ముక్కెర ప్రేమ్ సాగర్, వినుకొండ శంకరాచారి, రంగు బాబు తదితరులు పాల్గొన్నారు.

# గుడెల్లి కావ్య ఫౌండేషన్ ప్రారంభం

అక్షర దర్బార్ , ములుగు ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని రామాలయం ఆవరణలో శనివారం గుడెల్లి ఓదెలు–కేతదంపతుల కూతురు కావ్య పేరుతో ఏర్పాటు చేసిన గుడెల్లి కావ్య ఫౌండేషన్ను జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పైడాకుల అశోక్ మాట్లాడుతూ, దివ్యాంగురాలైన కావ్య సాటి దివ్యాంగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల బిక్షపతి, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు గుంటోజు పావని, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అభినయ్, ఫౌండేషన్ సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



# 3 హాస్పిటళ్లు..
# 30 మెడికల్ క్యాంపులు

- మేడారంలో వైద్య సేవల కోసం ఏర్పాటు
- జాతరకు వెళ్లే రూట్లలో మరో 42 క్యాంపులు
- 35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



అక్షరదర్బార్, మేడారం : మేడారం సమ్మక్క–సార లమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతా ధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదే శించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణా ళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరా లను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివ రించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముంద స్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.

## 50 పడకల ప్రధాన హాస్పిటల్

జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారం లోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిస రాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఎనిమిది రూట్లలో క్యాంపులు

వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్–రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ – మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## 3,199 మందితో వైద్య సైన్యం

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించ నున్నారు.

## అత్యవసర సేవలకు 35 అంబులెన్సులు

గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటల్స్‌లో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

# పిల్లల కిడ్నాప్ ముఠా గుట్టురట్టు

- కాజీపేట, టాస్క్ ఫోర్స్ టీం ప్రత్యేక ఆపరేషన్
- అంతర్ జిల్లాకు చెందిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఐదుగురు చిన్నారుల రెస్క్యూ
- వారి తల్లిదండ్రులకు అప్పగింత
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్ కమిషనరేట్ పరిధిలో వరుసగా చిన్నపిల్లల అపహరణకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను కాజీపేట, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు శనివారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన కొడుపాక నరేశ్, వెల్పుల యాదగిరి రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌ల వద్ద నిద్రిస్తున్న చిన్నారు లను లక్ష్యంగా చేసుకున్నారు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో వారు చిన్నారులను అపహరిస్త ున్నారు. అలా అపహరించిన చిన్నారులను పిల్లలు లేని దంపతులకు విక్రయించి సొమ్ము చేసు కుంటున్నారు. పిల్లల గురించి దంపతులు అడిగితే అనాథాశ్రమం నుంచి పిల్లలను తీసుకువస్తున్నామని నమ్మబలికేవారు. దీనిలో భాగంగానే గత నెల 28న నిందితులు కాజీపేట రైల్వే స్టేషన్ బయట నిద్రిస్తున్న ఓ చిన్నారిని అపహరించారు. ఈ కిడ్నాప్ పై నమో దైన కేసును సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. కాజీపేట, టాస్క్ ఫోర్స్ పోలీసులను రంగంలోకి దించారు. పోలీసులు పలుచోట్ల ముమ్మర దర్యాప్తు చేపట్టి తాజాగా నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. పోలీసుల విచారణలో కొడుపాక నరేశ్, వెల్పుల యాదగిరి తమ నేరాన్ని అంగీకరించారు. కాజీపేటలోనే కాకుండా నిందితులు గతంలో వరంగల్, మంచిర్యాల, రామగుండం రైల్వే స్టేషన్ల వద్ద నలుగురు చిన్నారులను కిడ్నాప్ చేసినట్లు ఒప్పు కొన్నారు. మొత్తం ఐదుగురు చిన్నారుల జాడ చెప్పడంతో పోలీసులు వారిని సురక్షితంగా రెస్క్యూ చేసి వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ కేసులో పిల్లలను కొనుగోలు చేసిన దంపతులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసిన పిల్లల్లో పది నెలల పాపలు, మూడు సంవత్సరాల బాబు ఉన్నారు. కిడ్నాప్ ముఠాను చాక చక్యంగా పట్టుకున్న టాస్క్ ఫోర్స్, కాజీపేట పోలీస్ అధికారులను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు లను అందజేశారు. సమావేశంలో డీసీపీ కవిత, ఏసీపీలు మధుసూదన్, ప్రశాంత్ రెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

## ఉపాధి పథకం
# నిర్వీర్యానికి కుట్ర

- కేంద్ర ప్రభుత్వానిది కక్షసాధింపు చర్య
- బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు తెలియజేయాలి
- కాంగ్రెస్ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు పిలుపు

అక్షరదర్బార్, హనుమకొండ : ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) పథకంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ పేదల పొట్ట కొడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది కుటుంబా లకు జీవనాధారంగా ఉన్న ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడం ప్రజా స్వామ్యానికే విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పథకాల పేర్లు మార్చాలనే నెపంతో ప్రజలను మభ్యపెడుతూ పనులు నిలిపి వేస్తున్నారని, దీనివల్ల కూలీలు తీరని అన్యాయానికి గురవుతున్నా రని మండిపడ్డారు. దేశాభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను అడ్డుకోవడమే బీజేపీ విధానంగా మారిందని రాజేందర్ రెడ్డి ఆరో పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏమాత్రం పాత్ర లేని ఆ పార్టీ, ఇప్పుడు ఆర్టీఐ వంటి ప్రజా ప్రయోజన చట్టాలనూ బలహీనపరు స్తోందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధిని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూపాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు చేసిన ద్రోహాన్ని ప్రతి వార్డులోనూ ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. వరంగల్‌కు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని, పదేళ్లు గడిచినా మామునూరు విమానాశ్రయం ఊసే లేకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం బీజేపీ వైఫల్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

# మహిళా సమాఖ్య సంఘాలకు
# పక్కా భవనాలు ఎప్పుడు..?

- ముక్కుబడిగా కొనసాగుతున్న సమావేశాలు
- మండలంలో పక్కా భవనం ఒక్కటే..!




అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మహిళా గ్రామైక్య సంఘాల సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం శాశ్వత వేదికగా నిలిచే పక్కా భవనాల నిర్మాణం ఎప్పుడు జరుగుతుందన్న ప్రశ్న మొగుళ్ల పల్లి మండలంలో ఉత్పన్నమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మహిళా సమాఖ్య భవనాలు నిర్మించాలని నిర్ణయించి, ఒక్కో భవనానికి రూ.11 లక్షల నిధులు కేటాయించనున్నట్లు తెలిపింది. మొగుళ్లపల్లి మండలంలో 814 గ్రామైక్య సంఘాలు, 34 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇప్పటివరకు మండలంలోని పర్లపల్లి గ్రామంలో ఒక్కటే మహిళా సమాఖ్య పక్కా భవనం నిర్మాణం పూర్తైంది. మిగిలిన 25 గ్రామపంచాయతీల్లో ఇంకా భవనాలు అందుబాటులోకి రాలేదు. స్థలం అందుబాటులో ఉన్న గ్రామాల్లో మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలో 200 గజాల లోపు స్థలాన్ని గుర్తించి, గ్రామసభ తీర్మానం చేసి ఎంపీడీవోకు ప్రతిపాదనలు పంపితే, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల ద్వారా కలెక్టర్ అనుమతితో ఉపాధి హామీ మెటీరియల్ నిధుల నుంచి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నారు. అయితే మండలంలో అధికారులు, మహిళా సంఘాల మధ్య సమన్వయం లోపించడంతో కొత్త భవనాలు త్వరలో అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు చెట్ల కింద లేదా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తుండగా, కొన్ని చోట్ల నెలల తరబడి సమావేశాలు జరగడం లేదని మహిళలు వాపోతున్నారు. రుణాలు మంజూరైన సమయంలో మాత్రమే సమావేశాలు జరగడంతో ప్రభుత్వ పథకాలు, వడ్డీ రాయితీలు, సబ్సిడీలపై అవగాహన లోపిస్తోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని మహిళా గ్రూపులను చైతన్యవంతం చేయాలని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, సమావేశాలు జరపని గ్రూపులపై సమీక్ష చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని ఎంజెపి పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల ఏసీపీ సతీష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్–సీట్ బెల్ట్ ధరించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకూడదని, మద్యం సేవించి వాహనం నడపరాదని వివరించారు. ఈ సదస్సులో శాయంపేట సీఐ పి. రంజిత్ రావు, ఎస్సై జె. పరమేశ్వర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలో కనిపించిన అనుమానాస్పద పాదముద్రలను అటవీ శాఖ అధికారులు పరిశీలించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ప్రాథమికంగా అవి పులి పాదముద్రలు కాకపోవచ్చని అధికారులు తెలిపారు. పూర్తి నివేదిక వచ్చే వరకు ఒకటి నుంచి మూడు రోజుల పాటు గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళ బయటకు వెళ్లే సమయంలో టార్చ్‌లైట్, అగ్గిపెట్టె తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, అనుమానం కలిగితే మంట వెలిగించే విధంగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ ఘటనపై గ్రామస్తులు భయాందోళన చెందొద్దని, పరిస్థితిని అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని అధికారులు భరోసా ఇచ్చారు.



## వరికోలులో ఉచిత కంటి పరీక్షలు

**–కళ్ల జోళ్లను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి**

అక్షరదర్బార్, పరకాల : పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తన సొంత ఊరు వరికోలులో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అర్హులకు ఉచిత కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. డిసెంబర్ 28, 2025న ప్రారంభమైన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని కళ్ల జోళ్లను అందజేశారు. పుట్టిన ఊరుకు సేవ చేయాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## 'శ్రీవేద'లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

అక్షరదర్బార్, పరకాల : శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియాంక, కీర్తి రెడ్డి, వేద, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.







## గుడి మహేశ్వరంలో ప్రజాబాట పొలం బాట

అక్షర దర్బార్, దుగ్గొండి: దుగ్గొండి మండలం గుడిమల్లం గ్రామంలో గ్రామ సర్పంచ్ కూర తోట స్వప్న సురేష్ ఆధ్వర్యంలో ప్రజాబాట పొలం బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నేతలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్రజాబాట పొలం బాటలో ప్రతి వార్డు ప్రాంతంలో విద్యుత్ సమస్యలను తెలుసుకొని, కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించబడ్డాయి. మిగతా సమస్యలపై ఎస్టిమేషన్ వేసి ప్రపోజల్ చేయడం జరిగింది. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కూర తోట స్వప్న సురేష్ అధ్యక్షతన నిర్వహించారు.




## 'గీతాంజలి'లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణంలోని గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్‌లో శనివారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వేషధారణలలో పాల్గొని నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా, ఉపాధ్యాయులు పండుగ ప్రాముఖ్యతను వివరించి పిల్లలకు సంక్రాంతి విలువ తెలియజేశారు. కార్యక్రమంలో గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీ కోన కంచి రామకృష్ణ, ప్రిన్సిపల్ శ్రీమతి మమతా ప్రియాంక సర్కార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915